

# గులాబీ
## దాని ముళ్ళు

కమలేష్ పటేల్

ప్రియమైన స్నేహితులారా,

మనందరమూ మూడు ప్రధానమైన మధుర క్షణాల సంగమంలో సమావేశమయ్యాం : ఒకటి, మన పూజ్య ఆదిగురువులు, ఫతేఘర్ (ఉత్తర్ ప్రదేశ్) కు చెందిన శ్రీరామచంద్రజీ (లాలాజీ) యొక్క 147వ జయంత్యుత్సవం; రెండు, వారి పేరున స్థాపించిన శ్రీరామచంద్ర మిషన్ అనే ఆధ్యాత్మిక సంస్థ యొక్క 75వ వార్షికోత్సవం; ఇక మూడవది, కన్హా శాంతి వనంలోని ధ్యాన మందిర ప్రారంభోత్సవం.

లాలాజీ అవతరణనుండి ఇప్పటివరకు పకృతి మనకు పరంపరగా ఒక సజీవ మాస్టరుని ప్రసాదిస్తూనే వుంది. గులాబీకి దూరంగా ఉంటూ కూడా దాని సౌందర్యాన్ని ఎలా ఆస్వాదిస్తూంటారో, అదే విధంగా ఒక యోగ్యుడైన శిష్యుడు గురువు సన్నిధిలో లేకున్నా కూడా ఆయనలో (ఆయన అస్తిత్వంలో) నిమగ్నమై, ఆనందిస్తూ ఉండగలుగుతాడు. అయితే గులాబీ పరిమళాన్ని ఆఘ్రాణించాలంటే మాత్రం దాని దగ్గరకు వెళ్ళవలసిందే. గులాబీని చేత్తో పట్టుకోవలసిందే. మీరున్న చోటనే మాస్టరును కనుగొనవచ్చు; ఐనప్పటికీ, దానిలో పూర్తి సార్థకత లేదు. ఒక దశలో ఆయన సన్నిధిలో ఉండవలసిన అవసరం వస్తుంది. కాని ఈ పువ్వును చేత్తో పట్టుకున్నప్పడు మాత్రం దానికి ముళ్ళుంటాయి జాగ్రత్త! గ్రుచ్చుకోగలవు. ఎందుకంటే, మాస్టరు యొక్క భౌతిక సాన్నిధ్యంలో ఉండే అవకాశాలు ఎన్నుంటే, అన్ని ప్రమాదాలు కూడా ఉంటాయి. హృదయపూర్వకంగా వీటిని ఎదుర్కొన్నట్లైతే, ఈ అపాయాలే గొప్ప వరాలుగా మారతాయి;  కాని అటువంటి సందర్భాల్లో హృదయం గనుక కరగకపోయినట్లయితే మాత్రం, ఆధ్యాత్మిక పతనానికి దారి తీసేవి కూడా అవే.

లాలాజీ కాలంలో జనం ఉన్నతమైన ఆధ్యాత్మిక స్థితిని పొందటానికి వారి వద్దకు వచ్చేవారని బాబూజీ ఒకసారి పేర్కొనడం జరిగింది. కానీ సాక్షాత్తు బాబూజీగారి కాలంలోనే కేవలం మనశ్శాంతి కావాలని వచ్చేవారు. అది కూడా కొన్ని దశాబ్దాల క్రిందటి మాట. కాలం మారుతున్న కొద్దీ అలాగే పతనం జరగడం కూడా కొనసాగుతూ వచ్చింది. ఈ రోజుల్లో జనం సాధారణంగా మాస్టరు వద్దకు ఐహిక విషయాల గురించి, భౌతిక విషయాలను గురించిన మార్గదర్శనం కోసమే వెళ్తూంటారు. అంతులేని ప్రాపంచిక సమస్యల భారంతో సతమవుతూ ఉన్నప్పడు, ‘మన

సమస్యలను పరిష్కరించగలిగేవాడు కాకపోతే ఇక మాస్టరెందుకు?' అంటారు. అలా పరిష్కారం లభించనట్లయితే, 'ఇక ఆయన వద్దకు వెళ్ళడం ఎందుకు?' అని వాదిస్తారు కూడా. వార్షికోత్సవాలనీ, పుట్టినరోజులనీ, పెళ్ళిళ్ళనీ, గృహ ప్రవేశాలనీ, కొత్త ఉద్యోగమనో, కొత్త వ్యాపారమనో - వారివారి ప్రత్యేక దినాల్లో ఆశీస్సుల కోసం వస్తూంటారు. అది గాకపోతే ఎవరో ఒకరి మీద ఫిర్యాదు చేయడానికి వస్తారు. మాస్టరుని ఇదీఅదీ అడగటం వల్ల కలిగే ఫలితం ఏమిటో తెలుసా? ఎటువంటి ప్రత్యేకమైన ఆశీస్సులు కోరినా, ఈ కోరడమే పెద్ద అవరోధంగా మారుతుంది. ఐహికపరమైన ఆశీస్సులు కోరినా, ఆధ్యాత్మిక పురోగతిని కోరినా, ఆ ఆశించే వైఖరే హృదయాల మధ్య జరిగే ప్రవాహానికి ఆనకట్టలా అడ్డుగోడగా నిలుస్తుంది. మాస్టరుగారు ఇంకా అద్భుతమైన ఆశీస్సులు ఇవ్వాలనుకుంటారు; కానీ జనం అవివేకంగా, పుట్టినరోజునాడు ఆశీస్సులంటూ, దీవెనలంటూ అల్పమైన విషయాలతో తృప్తిపడిపోతూంటారు!

అసలైన దీవెనంటే ఏమిటి? జీవితమనే చిక్కుముడిని విప్పి, జీవిత లక్ష్యాన్ని నెరవేర్చేదే అసలైన దీవెన. జీవితకాలంలో అటువంటి ఆశీర్వాదం ఒక్కసారి అందుకోగలిగితే, మరి ఇంకేమైనా దీవెనలు అవసరమౌతాయా? అందుకే పూజ్య బాబూజీ, జీవితకాలంలో ఒక్కసారి మీరు మీ మాస్టరును కలవగలిగితే చాలన్నారు; ఆ తరువాత ఎన్నిసార్లు కలిసినా అవి అదనంగా దొరికిన సందర్భాలే అవుతాయి. కాబట్టి ఆ ఒక్కసారి కలిసిన సమయంలో ఉండే మనఃస్థితిని బట్టే చాలా ఆధారపడి ఉంటుంది.

**అసలైన దీవెనంటే ఏమిటి?**
**జీవితమనే చిక్కుముడిని విప్పి, జీవిత లక్ష్యాన్ని నెరవేర్చేదే**
**అసలైన దీవెన.**

కేవలం ప్రేమించడం కోసం ప్రేమిస్తూ, ఏ కోరికా లేకుండా మాస్టరు వద్దకు వచ్చేవాళ్ళు చాలా అరుదు. అలా గౌరవప్రదంగా గురువును సమీపించగలగడం అనేది నిజంగా, శ్రీకృష్ణభగవానుడు ఎంతో గొప్పగా చెప్పినటువంటి నిష్కామకర్మకు సూచకం. అటువంటి కోరికలులేని, ప్రేమపూరితమైన హృదయంలోకి మాస్టరు పిలవకుండానే, చెప్పకుండానే ప్రవేశిస్తారు. గురుశిష్యుల మధ్య ఒక విధమైన యోగస్థితి చోటు చేసుకుంటుంది. ఆ స్థితిలో రెండు హృదయాలూ – ప్రాణాహుతి ప్రసరణ చేసే హృదయం, అందుకొనే హృదయం – రెండు హృదయాలూ కూడా పరస్పరం సంపూర్ణంగా అర్థం చేసుకోగలుగుతాయి. తనంత తానుగానే స్పందన-ప్రతిస్పందన ఇరువురి మధ్య జరగడం ప్రారంభిస్తుంది, రెండు హృదయాలూ పూర్తి నిశ్శబ్దంలో ఒక అద్భుత శక్తితో స్పందిస్తుంటాయి. దాన్ని వివరించవలసిన అవసరం గాని, సమర్థించుకోవలసిన అవసరం గాని, లేదా ధృవీకరించుకోవలసిన అవసరం గాని ఉండదు. అయితే, ఈ విధమైన స్పందన సాధకుడిలో జరగడం అనేది, అతని హృదయం అంతా సంవత్సరాల తరబడి అంతులేని కోరికలతో నిండిపోయి ఉంటే, అది వాయిదా పడుతుంది. కనురెప్పపాటున జరగవలసిన ప్రక్రియ, అంచనాలకు అందనివిధంగా కొన్ని జన్మలు పట్టవచ్చు.

అభ్యాసంతో, అవగాహనతో, పూర్తి అంతర్ముఖ [ప్రత్యాహార] స్థితిలో ఉన్న శిష్యుని జీవితంలో మాస్టరే కేంద్రం అయిపోతారు. అలా మాస్టరులోని దివ్య లక్షణాలను అనుభూతి చెందిన తరువాత, శిష్యుడికి మాస్టరు యొక్క భౌతిక అస్తిత్వాన్ని సమీపించాలన్న ప్రేరణ కలుగుతుంది. ఈ ప్రేరణ అంతరంగంలో నుండి రావాలి. అలా కాకుండా, సాధకులు కొత్త వారిని, వి.ఐ.పి.లను, వారిలో అటువంటి ప్రేరణ లేకుండా గనుక మాస్టరు ముందుకు దురదృష్టవశాత్తు అలా తోసినప్పుడు, అనవసరంగా సమస్యలు తలెత్తుతూంటాయి. ధ్యాన పద్ధతిని గురించిన అవగాహన, అనుభవం కొంతైనా ఉంటే తప్ప, మాస్టరుతో గడిపే ఆ క్షణాన్ని సరైన విధంగా అందుకొని, హర్షించే పరిస్థితిలో ఉండటం కష్టం.

**కేవలం ప్రేమించడం కోసం ప్రేమిస్తూ, ఏ కోరికా లేకుండా మాస్టరు వద్దకు వచ్చేవాళ్ళు చాలా అరుదు. అలా గౌరవప్రదంగా గురువును సమీపించగలగడం అనేది నిజంగా, శ్రీకృష్ణభగవానుడు ఎంతో గొప్పగా చెప్పినటువంటి నిష్కామకర్మకు సూచకం. అటువంటి కోరికలులేని, ప్రేమపూరితమైన హృదయంలోకి మాస్టరు పిలవకుండానే, చెప్పకుండానే ప్రవేశిస్తారు. గురుశిష్యుల మధ్య ఒక విధమైన యోగస్థితి చోటు చేసుకుంటుంది. ఆ స్థితిలో రెండు హృదయాలూ – ప్రాణాహుతి ప్రసరణ చేసే హృదయం, అందుకొనే హృదయం – రెండు హృదయాలూ కూడా పరస్పరం సంపూర్ణంగా అర్థం చేసుకోగలుగుతాయి. తనంతతానుగానే స్పందన-ప్రతిస్పందన ఇరువురి మధ్య జరగడం ప్రారంభిస్తుంది. రెండు హృదయాలూ పూర్తి నిశ్శబ్దంలో ఒక అద్భుత శక్తితో స్పందిస్తుంటాయి. దాన్ని వివరించవలసిన అవసరం గాని, సమర్థించుకోవలసిన అవసరం గాని, లేదా ధృవీకరించుకోవలసిన అవసరం గాని ఉండదు.**

మన పిల్లలను, యువకులను మనం తీసుకు వచ్చేటప్పుడు చాలా జాగ్రత్త తీసుకోవాలి, ఎందుకంటే వాళ్ళకి పరిస్థితిని గురించిన అవగాహన ఉండదు. వాళ్ళను అనవసరంగా ముందుకు తొయ్యడంలో అర్థం లేదు. వాళ్ళకు నిద్ర వస్తున్నప్పుడు సుఖంగా ఉండే పడకగదిలోకి తీసుకువెళ్ళకుండా వాళ్ళకు అలవాటు లేని నేలపై కూర్చోబెట్టినా, లేక ప్రసాదం అనుకుంటూ ఆశ్రమంలో దొరికే వాటిని తినమన్నా, వాళ్ళు తిరగబడవచ్చు. ఆ పరిస్థితులను ద్వేషించడం ప్రారంభిస్తారు కూడా. మాస్టరు చుట్టూ ఉండే అసౌకర్యమైన వాతావరణాన్ని ఎదుర్కోవడంలో కలిగిన ఇటువంటి అనుభవాలు వారిలో ఒత్తిడిని పెంచుతాయి. వాళ్ళ ఉద్వేగాలకు ఇబ్బంది కలగడం వల్ల అవన్నీ ఉపచేతనావస్థలో పేరుకుపోతాయి; ఇవే తరువాత జీవితంలో పిల్లలకు, మాస్టరుకు మధ్య అడ్డుగోడలు సృష్టించవచ్చు.

హృదయపూర్వకమైన భావంతో మాస్టరు దగ్గరకు వెడితే ఎంత మంచిదో కదా! చిత్తశుద్ధి గల శిష్యుడు తన మాస్టరును కలవడానికి ఇంట్లో నుండి బయలుదేరినప్పుడు, ఆతని అంతరంగ స్థితి ప్రేమతోనూ, పూజ్యభావంతోనూ, ఏమి జరుగుతుందోనన్న తియ్యని ఆశ్చర్యంతోనూ నిండి ఉంటుంది. మాస్టరు గది వద్దకు రాగానే, ఒక నెమ్మదితో లోపలికి ప్రవేశిస్తాడు. అటువంటి శిష్యుల కళ్ళు నేలవైపు చూస్తూంటాయి – ఆ పవిత్ర స్థలం పట్ల ప్రార్థనాపూర్వకమైన హృదయంతో ఉంటారు. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ తమ శరీర భారాన్ని పూర్తిగా మోపకుండా మెల్లగా నడుస్తారు. అటువంటి నిజమైన శిష్యులు, ముందు కూర్చోవాలని గాని లేక సౌకర్యంగా ఉండే చోట కూర్చోవాలని గాని అనుకోరు. మాస్టరు సమక్షంలో సహజంగానే వాళ్ళు తమ ఆలోచనలను, కోరికలను, అభిప్రాయాలను విడిచి పెట్టేస్తారు. మాస్టరును సంతోషపరచే విధంగా, వారికి అనుగుణంగా వాళ్ళు నిజంగా తయారవ్వాలనుకుంటే, తాత్కాలికంగానే అయినా సరే అలాగే అన్నీ విడిచి పెట్టేసి కూర్చోవాలి.

ప్రతీ విషయాన్నీ అస్తమానం విశ్లేషిస్తూ, నిర్ధారణలు చేసుకుంటూండటం, మాస్టరు చేసే పనిని సరిగ్గా జరగ నివ్వదు. మాస్టరు సన్నిధిలో, వ్యక్తిత్వం అంతమైపోవాలి; ఒకవేళ ఉన్నా కూడా, సరైన శిష్యుడైతే కనీసం పూజ్యభావంతో కూడిన నిశ్శబ్దాన్ని పాటించాలి. మాస్టరు చేసే

ప్రతీ కదలికను విశ్లేషించడం మంచి శిష్యుడి లక్షణం కాదు. ఇరువురి మధ్య నిజమైన సంభాషణ జరగాలంటే – నిజమైన యోగసంభాషణ జరగాలంటే – అంతరంగంలో పూర్తి నిశ్శబ్దం అవసరం. వెతికే కళ్ళు, ప్రశ్నించే మనసులు, ఆశించే హృదయాలు, ఇవన్నీ వెనుకంజ వెయ్యాలి. ఒకవైపు మాస్టరుగారి హృదయంపై పూర్తిగా దృష్టిని సారిస్తూనే, ఆయన అంతరంగ స్థితికి అనుగుణంగా మీ అంతరంగ స్థితి ప్రతిస్పందించే అనుభూతి కోసం ప్రయత్నించండి.

మాస్టరుతో సామీప్యత సంభవించినప్పడు, సాధారణంగా ఒక కొత్త కష్టం ప్రారంభమవుతుంది. ఈ కష్టం ముందుముందు ఒక వరంగానైనా పరిణమించవచ్చు లేదా శాపంగా కూడా మారవచ్చు. ఎప్పటిలాగే ఇదంతా శిష్యుడిపైనే ఆధారపడి ఉంటుంది. మాస్టరు యొక్క విలక్షణమైన వైఖరులు, విచిత్రమైన అలవాట్లు, ఇప్పడు శిష్యుడికి ప్రత్యక్షంగా కనిపించడం మొదలవుతాయి. ఇంతకు పూర్వం దైవస్వరూపంగా ఊహించుకున్న మాస్టరు, కంటికి కనపడే ఈ లక్షణాల వల్ల సామాన్యునిగా కనిపించి, ఆయనను బేరీజు వేయడం మొదలెడతాడు. ప్రియతమ బాబూజీ ఒకసారి పేర్కొన్నట్లుగా, “నన్ను చూడటానికి వస్తారు గాని నిజంగా ఎవరూ నన్ను చూడరు!” అన్నట్లుగానే ఉంటుంది. సాధారణంగా మనకున్న చైతన్యావస్థను బట్టి, మనం గ్రహించగలిగే స్థాయిని బట్టే మనకు ఏదైనా కనిపిస్తుంది. మన చైతన్యస్థాయిని బట్టి ఉండే అథమస్థాయి దృక్కోణం నుండి చూసినప్పడు, ఉన్నత స్థాయికి చెందిన స్థితులను దర్శించడం కష్టసాధ్యమవుతుంది. మనం చూడగలిగేది కేవలం మన చైతన్యం యొక్క ప్రతిబింబం మాత్రమే; అందుకే మాస్టరు మనకు ఒక అద్దంలా అవుతారు. మనం ఆయనలో చూసేది, మన మనోవైఖరులను బట్టీ, ఆకాంక్షలను బట్టీ - టూకీగా చెప్పాలంటే మన సంస్కారాల పైన - ఆధారపడి ఉంటుంది. ఈ సంస్కారాలు, వాటి ప్రభావం వలన నిస్సందేహంగా అనుమానాన్ని సృష్టిస్తాయి. ఒక విధమైన అసమ్మతిని, నైరాశ్యాన్ని సృష్టిస్తాయి; దాని వల్ల మరింత ఎక్కువగా నిరోధించేతత్త్వం పెరుగుతుంది. తనకు, మాస్టరుకూ మధ్య ఒక గోడను నిర్మించుకోవడం జరుగుతుంది. దీన్ని నివారించుకోగలిగితేనే మాస్టరును నిజంగా మాస్టరుగా గౌరవించగలగడం సాధ్యమవుతుంది. దీన్ని నివారించగలమా? అది మళ్ళీ, శిష్యునిపైనే ఆధారపడి ఉంటుంది.

మీరు గనుక ఈ దశకు చేరుకున్నట్లయితే దయచేసి నిరాశపడకండి; ఎందుకంటే ఇక ముందు జరుగవలసిన వికాసానికి దూరమయ్యే అవకాశం ఉంది. అయితే మాస్టరులో గమనించిన విచిత్ర వైఖరులను ఈపాటికి సరిగ్గా అర్థం చేసుకొని ఉండాలి. ఈ గందరగోళ పరిస్థితులను వినియోగించుకుంటూ, వీటిని దివ్యత్వం కోసం పరితపించే హృదయంతో ఎంత తేలికగా పరిష్కరించుకోవచ్చో గమనించండి; తార్కిక దృష్టితో ఒకప్పడు మాస్టరులో వైఫల్యాలుగా కనపడ్డ వ్యత్యాసాలన్నింటినీ సహజంగా అర్థం చేసుకోగలిగేది, ఇటువంటి దైవ పరితప్త హృదయంతోనే. మాస్టరులో భిన్నంగా కనిపిస్తున్న అంశాలన్నిటినీ శిష్యుడు తన హృదయంలో లయం చేసుకోవడంలో విఫలమైనప్పడు, శిష్యుడు ముందుకు సాగవలసిన ఆధ్యాత్మిక యాత్రకు తానే అవరోధంగా మారతాడు. ఏదో ఒక దశలో ప్రతీ శిష్యుడూ తన మాస్టరుకు తన హృదయంలోనే శిలువ వేస్తూంటాడు. ఈ దశను అర్థం చేసుకోవడం ద్వారానూ, అధిగమించడం ద్వారానూ శిష్యుడు ఉన్నతస్థాయికి ఒక్కసారిగా ఎదగగలుగుతాడు.

ఇరువురి మధ్య నిజమైన సంభాషణ జరగాలంటే – నిజమైన యోగసంభాషణ జరగాలంటే – అంతరంగంలో పూర్తి నిశ్శబ్దం అవసరం. వెతికే కళ్ళు, ప్రశ్నించే మనసులు, ఆశించే హృదయాలు ఇవన్నీ వెనుకంజ వెయ్యాలి. ఒకవైపు మాస్టరుగారి హృదయంపై పూర్తిగా దృష్టిని సారిస్తూనే, ఆయన అంతరంగ స్థితికి అనుగుణంగా మీ అంతరంగ స్థితి ప్రతిస్పందించే అనుభూతి కోసం ప్రయత్నించండి.

ఆధ్యాత్మిక పథంలో నడిచే ఒక బాటసారిని - అంతకు పూర్వం తన ఆధ్యాత్మిక మాస్టరును కనుగొన్నాడన్న ఆనందంతో ఉన్న బాటసారిని - ఇప్పుడు మాస్టరులో తాను ఊహించుకున్న కొరతలను గురించి అత్యంత దుఃఖంతో హృదయం పగిలేలా రోదిస్తున్న ఒక శిష్యుడిగా ఒకసారి ఊహించండి! ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కొంత మంది పద్ధతిని వదిలేసి మార్గదర్శికి దూరమవుతారు. మాస్టరు పట్ల ఏహ్యాభావంతో నిరంతరమూ ఆలోచనల్లో నిమగ్నమవడం వల్ల, ఫలితంగా వచ్చే ప్రతికూల ప్రకంపనలు తప్పక అతనిపై ప్రభావం చూపిస్తాయి. ఇంకా చెప్పాలంటే, కేవలం శిష్యుడు, మాస్టరు మాత్రమే ఈ ప్రతికూల సుడిగుండంలోకి లాగబడటం గాక, ఇతర సహచరులు కూడా ఇదే విధంగా ప్రభావితమవుతారు. ప్రేమ  తరంగాలు ఏ విధంగా వ్యాపిస్తాయో, అలాగే ద్వేష తరంగాలు కూడా వ్యాపిస్తాయి. ఇంత జరిగినా కూడా, ఉదారుడైన, కరుణాస్వరూపుడైన మాస్టరు ప్రతి ఒక్కరినీ స్వాగతిస్తూనే ఉంటారు. అందరి పట్ల తనను తాను సమర్పణ చేసుకుంటారు, మరిన్ని దాడులకు గురవడానికి సిద్ధంగా ఉంటారు, దుర్బలుడవుతారు. తన వ్యక్తిగత శాంతి కోసం తపించడం అనేది ఎప్పుడో మరచిపోవడం జరిగిపోతుంది. శిష్యులు తమ హృదయాల్లో తనకు శిలువ వేస్తున్నా పట్టించుకోరు. ఏం జరిగినా కూడా, ప్రేమలో ఎటువంటి షరతులు మోపడం చెయ్యరు!

**ఈ గందరగోళ పరిస్థితులను వినియోగించుకుంటూ, వీటిని దివ్యత్వం కోసం పరితపించే హృదయంతో ఎంత తేలికగా పరిష్కరించుకోవచ్చో గమనించండి; తార్కిక దృష్టితో ఒకప్పుడు మాస్టరులో వైఫల్యాలుగా కనపడ్డ వ్యత్యాసాలన్నింటినీ  సహజంగా అర్థం చేసుకోగలిగేది ఇటువంటి దైవ పరితప్త హృదయంతోనే.**

మాస్టరు యొక్క కరుణామయ తత్త్వం, ఆయన ప్రేమించే శిష్యుల హృదయాల నుండి వెలువడుతున్న నకారాత్మక ప్రకంపనాల ప్రభావాల నుండి తప్పించుకోనివ్వదు. మాస్టరుతో సహా, వ్యాకులత అనేది ప్రతిఒక్కరి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. వాస్తవానికి అటువంటి వ్యాకులత, మాస్టరులో ఉండే ఉన్నత స్థాయి సున్నితత్త్వం వల్ల మాస్టరునే ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. 1970ల చివరిలో ఒకసారి ఏమయ్యిందంటే, బాబూజీ, కస్తూరిగారితోనూ, ఇతర సీనియర్ సభ్యులతోనూ కూడి ఉన్నారు. అకస్మాత్తుగా కస్తూరిగారు వాతావరణంలో ఒక విధమైన కొట్టొచ్చిన మార్పుని గ్రహించారు – బాబూజీ అంతరంగ స్థితిలో ఒక విధమైన ఉపసంహరణను గమనించారు ఆమె. ఆయన చైతన్య స్థితి, విస్తరించిన స్థితి నుండి కొంచెం కుంచించుకుపోవడం ఆమె గమనించారు; అకస్మాత్తుగా ఆయన వ్యాకులతకు లోనయ్యారు. సోదరి కస్తూరిగారు బాబూజీని కారణం అడిగినప్పుడు, అయిష్టంగానే సమాధానమిస్తూ, ఫలానా కేంద్రంలోని సభ్యులు చీలికలై వర్గాలుగా తయారైన ఫలితంగా ఒక నకారాత్మకమైన రాజకీయ వాతావరణం ఏర్పడిందని బాధపడ్డారు.

శిష్యుల హృదయాలలో ప్రేమ ఆవరించడాన్ని, ద్వేషం ఆవరించడాన్ని, ఈ రెండు స్థితులనీ మాస్టరు వీక్షిస్తూనే ఉంటారు. ప్రేమలో ఉన్నప్పుడు కొంత తెగింపు ఉంటుంది; ఉదాహరణకు, ప్రియతముని కలుసుకోవడానికి ఎటువంటి అవరోధాన్నైనా లెక్కచేయకుండా ముందుకు సాగిపోతారు. ఏ కారణం చేతనైనా కోపం వచ్చి మాస్టరుకు దూరంగా వెళ్ళిపోవాలనుకున్నప్పుడు కూడా ఈ తెగింపు వైఖరే ఉంటుంది, కాని అది వ్యతిరేక దిశలో పనిచేస్తుందంతే. శిష్యుడిలో తెగింపు స్వభావం ఉన్నప్పుడు, ఉద్వేగాలతో కూడిన రెండు సందర్భాల్లోనూ కూడా మాస్టరు ప్రేక్షక పాత్ర వహిస్తారు. ఆయనకు పాపం ప్రత్యామ్నాయం ఏముంటుంది? అందుకే ఆయన ప్రార్థిస్తూ, నిరీక్షిస్తారంతే! శిష్యుడు కూడా సహనంతో ఉండాలి. క్లుప్తంగా చెప్పాలంటే, నిస్వార్థ, పవిత్ర ప్రేమ అనే ఈ మహాసాగరంలోనికి వచ్చిచేరే అనేక ఉపనదులు మాస్టరుతో సంగమిస్తూంటాయి.

శిష్యుడి ద్వారా అనేక స్థాయిల్లో జరిగే ఉద్వేగ పూరిత ధోరణులను సాక్షీభావంతో చూస్తూకూడా, మాస్టరు తన శిష్యుడి అహంకారాన్ని చాలా వరకూ పరిశుద్ధమయ్యేలా చూస్తారు. దీన్ని సాధించడం కోసం ఆయన ప్రత్యేకమైన పరిస్థితులను సృష్టిస్తూంటారు. అహంకారాన్ని తప్పించుకోవడం కంటే కూడా బహుశా కామాన్ని జయించడం చాలా తేలికనుకుంటాను. కామం విషయంలో నకారాత్మకమైన ప్రభావం ఉంటుందని ముందే తెలుస్తుంది; కాని అహం పెరుగుతున్నప్పుడు అలా తెలియదు. గుర్తుంచుకోండి, కామానికి అయిదు అవరోధాలే ఉన్నాయి, ఐదు వృత్తాలే ఉన్నాయి దాటడానికి; అదే అహానికి ఐతే, ఇరవైమూడు వృత్తాల్లో పదకొండు వృత్తాలు అహానికి సంబంధించే ఉన్నాయి! శిష్యుడి అహాన్ని పరిశుద్ధీకరించడంలో మాస్టరు చాలా జాగ్రత్త తీసుకోవాలి. ఒక్కోసారి ఎంత జాగ్రత్త తీసుకున్నా, శిష్యుడు అసహ్యించుకొనే అవకాశం ఉంది. అయినప్పటికీ శిష్యుడు బాధపడటం చూస్తున్నా సరే, మాస్టరు తన ప్రయత్నాన్ని కొనసాగించాలి. కబీరు మాటల్లో చెప్పాలంటే, మాస్టరు కుమ్మరిలా పని చేస్తారు: ఆకారాన్ని (వ్యక్తిత్వాన్ని) లోపల నుండి సర్దుతూ, బయట నుండి బంకమన్నును అద్దుతూంటారు. మనిషిగా ఉన్నారు కాబట్టి, ఈ క్లిష్ట సమయంలో, మాస్టరు కూడా శిష్యుడు అనుభవించే వేదనలన్నీ అనుభవిస్తూండటం జరుగుతుంది.

భక్తి పెరుగుతున్న కొద్దీ, మాస్టరు శిష్యునికి అందుబాటులో ఉంటూ తన వద్దకు చేర్చుకుంటారు. అప్పుడు భక్తుని జీవితంలో ఒక నూతన శకం ప్రారంభమవుతుంది. శిష్యుని అంతరంగ పరివర్తన తీవ్రతరమవుతుంది; శిష్యుడు ఆధ్యాత్మిక మత్తులో ఉన్మత్తుడవుతాడు. అది అమితమైన కృతజ్ఞతను అనుభూతి చెందే విధంగా దారి తీస్తుంది. అయినా అపాయం ఇంకా కొనసాగుతూ ఉంటుంది. ఇటువంటి పరివర్తనకు సంబంధించిన పరిస్థితుల్లో, శిష్యుడికి తాను ఇతరుల కంటే అధికుడనన్న భావం, ఇతరుల కంటే చాలా గొప్పవాడినన్న భావం కలిగే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితిని శిష్యునిలో వీక్షిస్తున్నప్పుడు మాస్టరు హృదయం పగిలి వెయ్యి ముక్కలవుతుంది.

మాస్టరుతో ఆధ్యాత్మిక ప్రయాణం చేస్తున్నంత సేపూ, ప్రతి ఒక్కరికీ కూడా అనూహ్యంగా ప్రగతి సాధించడమో లేక తాను సృష్టించుకున్న అంధకార కూపంలోనికి పతనమవడమో - ఏదో ఒకటి ఎంపిక చేసుకొనే అవకాశం ఉంటుంది. దీన్నే (పతనమవడాన్నే) నేను తనకు తానుగా తనపై ఏర్పరచుకున్న ఆధ్యాత్మిక వక్రత అంటాను. ఒక్కసారి ఈ అహం అనే సుడిగుండంలో ఇరుక్కుపోయామంటే, అందులో నుండి బయటకు రావడం చాలా కష్టం. ఇది గనుక సంభవించి, దురదృష్టకరమైన ఈ వక్రతను మీరు గుర్తించినట్లయితే, ఒక్క అడుగు వెనక్కి వేసి, మీ ప్రయత్నాలను మరల మీరు స్పష్టమైన హృదయంతో పునఃనిర్వహణ చేసుకోండి. అలాగే, అదే సమయంలో మిమ్మల్ని మీరు విశ్లేషణ చేసుకోవడమే గాక మాస్టరును, ఆయన సమర్థతలను కూడా విశ్లేషణ చేసుకుంటూ ఉండాలి. మాస్టరు యొక్క యోగ్యతను అంతరంగంలో తెలుసుకోవడంలో పాపం ఏమీ లేదు. అటువంటి స్థితిలో అలా చేయకుండా మీరు ముందుకు సాగలేరు. శిష్యుడు తనకు తాను సంపూర్ణంగా ఆత్మసమర్పణ

> **కబీరు మాటల్లో చెప్పాలంటే, మాస్టరు కుమ్మరిలా పని చేస్తారు: ఆకారాన్ని (వ్యక్తిత్వాన్ని) లోపల నుండి సర్దుతూ, బయట నుండి బంకమన్నును అద్దుతూంటారు. మనిషిగా ఉన్నారు కాబట్టి, ఈ క్లిష్ట సమయంలో, మాస్టరు కూడా శిష్యుడు అనుభవించే వేదనలన్నీ అనుభవించడం జరుగుతుంది.**

చేసుకోవాలని సంసిద్ధుడైనప్పుడు, “ఈయన నేను ఆరాధించడానికి యోగ్యుడేనా?” అనే మాస్టరును గురించిన ఈ పరీక్ష నిర్వహించడం తప్పదు. ఇలా చేస్తే మాస్టరును అవమానించడంగా భావించనవసరం లేదు. హృదయం పూర్తిగా సంతృప్తి చెందినప్పుడు మాత్రమే, వ్యక్తి తన వ్యక్తిత్వానికి రక్షణ కల్పించే అన్ని అవరోధాలను విడిచిపెట్టగలిగేది. ప్రేమలో అవరోధాలన్నీ కరిగిపోతాయి. కేవలం శత్రువుల పట్ల లేక మనకు ఇష్టం

లేని వ్యక్తుల పట్ల మాత్రమే ఈ రక్షణ ఏర్పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. కరిగిపోయిన అవరోధాలు, తద్వారా పెంపొందిన ధీరత్వంతో, నీటి చుక్క మహాసముద్రంలో మునక వేయడానికి సంసిద్ధమవుతుంది.

దురదృష్టవశాన, చాలా మందికి మాస్టరు విషయంలో స్పష్టత రావడానికి చాలా కాలం పడుతుంది. ఈ క్రమంలో ఉద్వేగపరమైన శక్తి చాలా వరకూ వ్యర్థమైపోతుంది. ఈ అంధకార సమయం అంతా కూడా వ్యక్తి, అస్థిరంగానూ, ప్రయోజనం లేకుండానూ ఉండిపోతాడు. ముందే ఊహించగలిగిన ఇటువంటి సమయాల్లో, మాస్టరు కూడా అశాంతితో ఉంటారు. ఆయన కూడా శిష్యుడి పరిస్థితితో ప్రతిస్పందిస్తూ, శిష్యుడి శ్రేయస్సు కోసం, స్థిరపడటం కోసం సంబంధించిన ఆలోచనలతో భారంగా ఉంటారు. శిష్యుడి ప్రయాణం క్షేమంగా జరగడం కోసం మాస్టరు ఇప్పుడు తన పనిని తీవ్రతరం చెయ్యవలసి ఉంటుంది. ఈ బలహీన దశలో, ఎటువంటి వక్రత ఏర్పడకుండా చూడవలసి ఉంటుంది.

**మాస్టరుతో ఆధ్యాత్మిక ప్రయాణం చేస్తున్నంత సేపూ, ప్రతి ఒక్కరికీ కూడా అనూహ్యంగా ప్రగతి సాధించడమో లేక తాను సృష్టించుకున్న అంధకార కూపంలోనికి పతనమవడమో - అనే ఎంపిక చేసుకొనే అవకాశం ఉంటుంది. దీన్నే (పతనమవడాన్నే) నేను తనకు తానుగా తనపై ఏర్పరచుకున్న ఆధ్యాత్మిక వక్రత అంటాను.**

ప్రతీ సన్నివేశంలోనూ కూడా, స్వీయ ప్రాధాన్యతే (తనకు తాను ప్రాధాన్యతనిచ్చుకోవడమే) ప్రధాన అవరోధంగా నిలుస్తుంది. అదే ఆధ్యాత్మిక మందకొడితనం అనే కాలవక్రతలో ఇరుక్కుపోయేలా చేస్తుంది. అహం తన పడగ ఎత్తుతూనే ఉంటుంది! మాస్టరు అందించే సూచనలు, సరిదిద్దుకునే జాగ్రత్తలు మన హృదయాలను నొప్పించవచ్చు. దురదృష్టవశాత్తు, అహానికి అసంఖ్యాకమైన పడగలున్నాయి. ఒక పడగను నాశనం చేస్తే దాని స్థానంలో మరో పడగ ఎత్తడానికి అహం సిద్ధంగా ఉంటుంది! ఈ ఆట ఇలా అనంతంగా కొనసాగుతూనే ఉంటుంది. మనం ఈ ఆట వల్ల ఏమీ ప్రయోజనం లేదన్న విషయాన్ని తెలుసుకొని, శాశ్వతంగా, ప్రేమపూర్వకంగా శరణాగతి కోరేవరకూ ఈ ఆట కొనసాగుతూనే ఉంటుంది. అప్పుడు మనం ఇంటికి చేరుకున్నట్లే! ఎంత కాలం నిరీక్షించాలి? మనం ఒకరికొకరు పంచుకొనే సమయం చాలా పరిమితంగా ఉందని మనం గుర్తించడం అవసరం. మన చేతుల్లో అపరిమితమైన సమయం లేదు! ఒక్కసారి, అన్ని విధాలా హృదయం సంతృప్తి చెందిన తరువాత, మనల్ని మనం సంపూర్ణంగా సమర్పించుకోవలసిన సమయం ఆసన్నమైనట్లే.

ప్రేమతోనూ, గౌరవంతోనూ,

కమలేష్ పటేల్

CELEBRATING 75 YEARS
SHRI RAM CHANDRA MISSION

మూడు ప్రధాన మధుర క్షణాల వేడుకలు:

ఫతేఘర్‌కు చెందిన మన పూజ్య ఆదిగురువులు,

శ్రీరామచంద్రజీ (లాలాజీ మహారాజ్) 147వ జయంత్యుత్సవం;

వారి పేరున స్థాపించిన ‘శ్రీ రామచంద్ర మిషన్‘ అనే విశిష్ఠ

ఆధ్యాత్మిక సంస్థ యొక్క 75వ వార్షికోత్సవం;

కన్హా శాంతి వనం, ధ్యానమందిర ప్రారంభోత్సవం.



కన్హా శాంతి వనం, హైదరాబాదు

heartfulness
purity weaves destiny